

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒకరకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరిదేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశిక గా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచారవ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచిచూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

### తీరెను కోరిక తీయగా.. పుల్లగా.......

పద్మావతమ్మగారికి గారికి చాలా ఆనందంగా ఉంది. ఇన్నేళ్ళకి తన కోరిక తీర్చుకునే ముహూర్తం పెట్టుకుందావిడ. ఒకటా రెండా, దాదాపు యాభైఏళ్ళ పైగా వయసున్న వయసున్న కోరిక అది. అలా అని పెద్ద కష్టసాధ్యమయినదేమీ కాదు. కోరరానిదీ, తీరలేనిదీ అంతకంటే కాదు, కానీ బహుశా ఆవిడ పుట్టి పెరిగిన పరిస్థితులవల్ల ఇప్పటివరకూ తీరనే లేదు. తనకి ఊహ తెలిసినప్పటినించీ అంటే ఉజ్జాయింపుగా అయిదేళ్ళు అనుకున్నా, తనతో పాటే పెరిగిన కోరికని కనీసం ఇప్పటికైనా నిజం చేసుకోవాలనేదే ఆమె తపన.

దీపావళి వెళ్ళిన నాలుగురోజులకి కార్తీక మాసంలో పుట్టింది ఆవిడ. తొందరలోనే అరవై పూర్తి అవుతాయి. పండగలనో, పబ్బాలనో ఎప్పుడూ ఇంట్లో ఉండే చుట్టాలు ఎవ్వరూ లేరు. భర్త, పెద్ద పాలేరు ఎడ్లు కొనడానికి కొమరగిరి పట్నం వెళ్ళారు. చిన్న పాలేర్లనిద్దరినీ సినిమాకెళ్ళమని డబ్బులిచ్చి పంపేసింది. కోడళ్ళిద్దరూ పండగలకని పుట్టింటికెళ్ళారు. మరుదులూ, తోడికోడళ్ళూ అన్నవరం వెళ్ళారు పిల్లలతో సహా. మావగారు గదిలో గాఢ నిద్రలో ఉన్నారు. నాలుగు గంటలవరకూ లేవరు ఆయన. అత్తవారింటికి వచ్చాకా ఇంత ఖాళీ సమయం, అది కూడా తనకి మాత్రమే సొంతమయినది దొరకడం బహుశా ఇదే మొదటి సారేమో ఆవిడకి. ఇంకేం, పండగే. అందుకే తొందరగా పని ముగించేసి మెల్లగా పెరట్లోకి వెళ్ళింది ఆవిడ.

పెరటి వాకిలి చాలా విశాలంగా ఉంటుంది. మధ్యలో పెద్ద గోడ. గోడకొకవైపు దూడల సావిడి, మరో వైపు పెరడు. పెరట్లో సరిగ్గా మావిడి చెట్టుకిందకి వేసి ఉంది ఎత్తుగా ఉన్న గడ్డి మేటు. కోనసీమ ప్రాంతాలలో ప్రతీ ఇంటికీ ముందో, వెనకో చిన్నదో, పెద్దదో గడ్డిమేటు వేసి ఉండడం చాలా సహజం. ఎండిన గడ్డిని మేటుగా వేసి పశువులకి మేతగా వాడతారు. అవసరం అయినప్పుడల్లా పై నించీ ఒక పద్ధతిలో గడ్డిని తీసుకుంటూ వస్తారు. పిల్లలేమో శెలవుల్లో గడ్డిమేట్లు ఎక్కి కిందకి జారుడు బల్లలు జారి, కింద పడేసి తొక్కి, గడ్డి

అంతా పాడైపోయిందని పెద్దవాళ్ళతో తిట్లు తింటారు. పద్మావతమ్మ గారింట్లో వేసే గడ్డిమేటు చాలా పెద్దది. దాదాపు ప్రహారి గోడ అంత ఎత్తుగా, పది అడుగుల దాకా ఉంటుంది.

పద్మావతమ్మగారు పద్మగా పుట్టింది కోసెడు దూరంలో ఉన్న మరో అగ్రహారంలో. పద్మావతిగా మెట్టింది మన అగ్రహారంలో. కాలక్రమంలో పద్మావతమ్మగానూ, పద్మావతమ్మగారి గానూ మారడానికి ఎక్కువ కాలం పట్టలేదు. పచ్చని పసిమి చాయలో, వి ద్యుద్దీపాల్లా వెలిగే కళ్ళతో, నుదిటిన ఎర్రగా మెరిసే బొట్టుతో బొట్టుతో శ్రీరమణగారు మిధునం కథలో చెప్పినట్టు కొద్దిగా వయసు మళ్ళిన గౌరీదేవి లాగే ఉంటుంది ఆవిడ.

పద్మావతమ్మ గారి తండ్రి పేరు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. ఆయన వేదాలు చదివిన పండితుడు, నిత్య దేవతార్చన, ఏటా లక్షపత్రి పూజలూ కావలసినంత మడీ, ఆచారం. పద్మావతమ్మ ఆయన పెద్ద కూతురు. ఆడపిల్లలంటే అక్కర్లేని పిల్లలనుకునే కుటుంబం కాదు గానీ, ఎప్పటికీ నెమ్మదిగా, తండ్రిదో, భర్తదో చెప్పుచేతల్లో అణకువగా పనీ పాటలు చేసుకుంటూ గుట్టుగా ఉండాలని అనుకునే కుటుంబమే వారిది. పేరుకు బడికి వెళ్ళినా తండ్రి దగ్గర భారత భాగవతాలు చదివింది ఆవిడ. చాకలి పద్దు కూడా పనివాళ్ళే వేసుకునే ఇంట్లో ఆవిడది గానీ, తరవాత చెల్లెళ్ళది కానీ చదువు ముఖ్యమని ఎవరికీ తోచలేదు.

అయిదో ఏట అమ్మ చింతపండుతో తళతళా తోమిన చిన్న రాగి పళ్ళెం ఇచ్చి ' పద్మా, పూలు కోసుకు రామ్మా' అంటే, చిట్టి చేతులతో కిందకు వంగిన జూకా మందారాలూ, నందివర్ధనాలూ కోసుకురావడంతో పని మొదలు.

' తమ్ముడికి నీళ్ళు పొయ్యవే పద్మా,

చెల్లికి జడ కట్టు,

తులశమ్మ కడిగి ముగ్గు పెట్టు,

కాస్త మడి బట్టలు ఆరేసి పెట్టు,

ఎసట్లో బియ్యం పోసి పెట్టు ' ఇలా పిల్ల వయసుతో పని స్థాయి పెరిగిందే తప్ప తరగలేదు.

' అష్టవర్షాత్‌భవేత్ కన్యా' అని గట్టిగా నమ్మిన ఆమె తండ్రిగారికి పక్కన అగ్రహారంలోని పెద్ద దీక్షితులుగారి పెద్దకొడుకు సంబంధం కలుపుకోవడం కష్టమేమీ కాలేదు. తెలుగుదేశంలోని ఎన్నో వేలమంది అమ్మాయిలలాగానే పెళ్ళి అనే మాటకి పెద్దగా అర్థం తెలియని రోజుల్లోనే ఆవిడ పెళ్ళి జరిగింది. అయిదేళ్ళవరకూ ఎవరేమి చెప్పినా తెలియని పసితనం. వెండి పట్టాలు పెట్టుకుని అల్లిబిల్లిగా తిరిగే బంగారంలాంటి కాలం ఎవరి జీవితంలోనైనా. అసలు పుట్టగానే కడియాలు, అందెలూ అలంకారాలూ అంటూ పుడుతూనే తగిలించేయడం కూడా ఆడపిల్లలని అణకువ పేరుతో హద్దులు ఏర్పరచడమేమోనని ఇప్పుడు ఆవిడ అనుమానం.

బాజా భజంత్రీలు, పల్లకి ఎక్కడం తప్ప బొత్తిగా మరేమీ గుర్తులేని అయిదురోజుల వేడుకగా సాగిన పెళ్ళి ఆవిడది. మనం చంటి పిల్లలకి వాళ్ళకి తెలియకపోయినా సరే మన తృప్తి కోసం చేసుకునే మొదటి పుట్టినరోజు లాంటిది. నాన్న కొన్న వడ్డాణం, వంకీలలాగానే మరో కొత్త నగ మంగళసూత్రం అనుకునే వయసు. తలంటుపోసుకోవడానికి వెళ్ళేప్పుడు అన్ని నగలూ తీసి జాగ్రత్త పెట్టిన అమ్మ, ఇది మాత్రం ఎప్పుడూ తియ్యకూడదు అని చెప్పినప్పుడు ఇంతైన పసి కళ్ళల్లో ఆశ్చర్యం. పెళ్ళి అవగానే ఉన్న చదువు ఊడింది. 'వివాహం విద్యనాశాయ' అని ఊరికే అన్నారా మరి. 'వాళ్ళ అత్తవారికి పిల్లని వీధుల్లోకి పంపటం ఇష్టం లేదు' ఎనిమిదేళ్ళ పిల్లమీద ఎన్ని ఆంక్షలో. వాళ్ళకిదే ఆనవాయితీట, మనదేముంది అని తేల్గ్గా తీర్పులు తీర్చేయ్యడం ఎంత సులువో. అలా ఆవిడ చదువు మూడో క్లాస్‌లో మూల పడింది. 'కాస్త పనీ పాటా నేర్చుకుంటే రేపు మెట్టేది పెద్ద ఇల్లు, పనికి వస్తుంది' అని పెద్ద వాళ్ళూ తేల్చేసారు. 'పెద్దపిల్ల అవగానే మంచి ముహూర్తం చూసి తీసుకెళతాం. అప్పటివరకూ మధ్య మధ్యలో తీసుకెళతాం.. పండగలకీ, పబ్బాలకీ' అని చెప్పి అత్తవారు వెళ్ళిపోయారు.

అలా పెరట్లోకి వెళ్ళాలన్నా, వీధిలోకి వెళ్ళాలన్నా కష్టమే మరి ఆ కాలంలో అమ్మాయిలకి.. ఇంక పొలాల్లోకి వెళ్ళే వీలేది? అల్లరి చేసే అవకాశమేది? బాల్యాన్ని బంగారు సూత్రాలతో కట్టేయడం కాదూ ఇది?

పద్మావతికి చిన్నప్పటినించీ సరదాగా ఉండడం ఇష్టం. తమ్ముళ్ళల్లాగ పొలాలకి వెళ్ళాలని, గోదావరి కాలువలో స్నానం చెయ్యాలని ఇలాంటివి. అవేమి పెద్ద కోరరానివి కాదు. తుప్పల్లోకి వెళ్ళి ప్రీతి మల్లెపూలు కోసుకురావాలని, పెద్దపొలానికి వెళ్ళేదారిలో చింతలతోపులో ఉన్న నారింజ చెట్టెక్కి కాయలు కోసుకోవాలని ఇలాంటివే అతి సాధారణమైన, చిన్ని కోరికలు. 'చిన్ని చిన్ని ఆశ' పాటలో లాంటి కోరికలు ఆవిడకి తెలియనే తెలియవు. ఒకటి రెండు సార్లు ఇలాంటివి చెయ్యబోయి తల్లితో తిట్లూ, దెబ్బలూ తింది. గోదారి వొడ్డునకూర్చొని పాంచాల మీదనించి దిగకుండా కార్తిక స్నానాలు, అవీ చెయ్యాలంటే ఆవిడకి విసుగు. నీళ్ళల్లోకి వెళ్ళి ఈత కొట్టడం నేర్చుకోవాలని సరదా. అదెప్పుడూ తీరలేదు. భక్త ప్రహ్లాదో, చెంచులక్ష్మో ఇలాంటి సినిమాలు మాత్రం మూడు నాలుగు చూసి ఉండవచ్చు ఆవిడ.

'ఆడపిల్లవి మొగవెధవలతో సమానంగా పొలాలంబట పడి తిరుగుతావా, ఎవరైనా చూస్తే? సర్లే అవతల వడియాలు పెట్టాలి పద' అనేది తల్లి.

నిన్నటి వరకూ అమ్మతో కలిసి చేసుకున్న పూజలూ, నోములూ ఇవ్వాళనించీ వేరు. 'ఇది మాది 'వరలక్ష్మీ వ్రతం నాడు అని అమ్మ అనగానే పద్మ కెంత ఏడుపు వచ్చిందో, వాళ్ళందరూ ఒక జట్టయి తనని వేరు చేసినట్టూ, పైగా 'వాళ్ళ అత్తవారింట్లో అవధానులు గారేట గురువుగారు, ఆయన్నే పిలవమన్నారు' అని ఇద్దరు గురువులు అమ్మావాళ్ళకి ఒకరు తనకి వేరొకరూ. భోజనాలు అవి మాత్రం మామూలే. వాటికేమీ తేడాలు లేవు లావుంది. అవన్నీ పెద్ద గందరగోళంగా ఉండేవి ఆవిడకి.

అలా ఎనిమిదేళ్ళనుంచీ పన్నెండు దాకా వెళ్ళిపోయింది తనకి తెలియకుండానే గ్రీష్మతాపానికి వసంతం నిలవలేక నిష్క్రమించినట్టు.

'మా పద్మ రాదమ్మా, గొబ్బిళ్ళకి, వాళ్ళ అత్తవారు పండగకి పంపమన్నారు' అని నాన్నమ్మో, అమ్మో చెప్పేసేవారు స్నేహితులకి. పదమూడు నిండి పధ్నాలుగు రాగానే ఆడంబరంగా, వైభవంగా అతవారింటికి ప్రయాణం.

'అక్కడ జాగ్రత్తగా ఉండాలి తెల్సిందా!, మన ఇంట్లోలాగా అల్లరి చేస్తే కుదరదు'

'హుఁ.. అల్లరి, ఏనాడు ఎరగని పదం.

'మీ అత్తగారు, మావగారు ఏమి చెప్పినా బుద్ధిగా విని మన ఇంటికి మంచిపేరు తేవాలి. ఫలానా వాళ్ళ పిల్ల అనగానే బంగారు తల్లి అనిపించుకోవాలి' ఇలా అమ్మ చెప్పినవి చెప్పకుండా వారం రోజులు నూరి పోసింది. వయ్యారి వంటిమీద మురిపెంగా ఎగిరే పరికిణీ ఓణీలు చీరగా మారడానికి ఒక నెల పట్టలేదు. అలా ఇంటికి పెద్దకోడలిగా ఇంకో అంకం మొదలయింది.

పొద్దున్న లేస్తే వంటలూ, వార్పులూ, ఊరగాయలూ, దేవతార్చనలూ.. మధ్యలో పలకరించే పెద్ద పెద్ద పనులూ, పండగలూ, పబ్బాలూ, వచ్చే పోయే చుట్టాలూ. ఇలా కాలం కరగడానికి ఎంతో సేపు అక్కర్లేదు. భర్త మాధవరావు చాలా మంచివాడు, అంటే తిండీ, బట్టా, పనులూ, పిల్లలూ ఇలా అన్నీ క్రమం తప్పకుండా సవ్యంగా జరిగిపోతే జీవితమంతా హాయిగా ఉన్నట్టు ఆయన లెక్క. అత్తగారు కొద్దిగా నోటి దురుసు మనిషి కావడాన ఆవిడ కనుసన్నల్లో మెలుగుతూ, మంచి కోడలనిపించుకోవడం కష్టమే.

"ఏమండీ, సరదాగా అలా అన్నవరం దాకా వెళ్ళొద్దామా, పెద్దవాడు పుట్టాక గుడికి తీసుకెళ్ళినట్టూ ఉంటుంది" అని అడిగితే,

"ఇప్పుడెలా, అవతల కొతలకొచ్చాయి వరిచేలు, అయినా మన గుడి ఉండగా ఎక్కడకో వెళ్ళడం దేనికి చెప్పు? హైరానా పడుతూ" అన్నాడు ఆయన. అలా అయిదుగురి పిల్లల తరవాత కూడా వాళ్ళిద్దరూ ఎక్కడకీ వెళ్ళింది లేదు.

" నేను కూడ పొలం రానా? ఒకసారి, వ్యవసాయం ఎలా చేస్తారో చూడాలని నాకు సరదా " అంటే..

"ఇంకా నయం. వచ్చి కుప్ప నూరుస్తానన్నావు కాదు మన ఇళ్ళళ్ళో ఆడవాళ్ళు పొలాలకి రావడం లేదు" అనేవాడు.

చక్కెరనీళ్ళలాంటి గంగాబొండాలని కూడా కొట్టించి ఇంట్లో తాగవలసిందే తప్ప పొలానికి వెళ్ళి తాగేందుకు వీలు లేదు. ఇలా - ఆవిడ చిన్నా, పెద్దా కోరికలు దోబూచులాడుతుండగానే వయసు మాత్రం మొహమాటం లేకుండ మీద పడింది. కార్తీక పౌర్ణమి నాడు తులసికోట దగ్గర దీపం పెడుతూ నేలకొరిగిన అత్తగారి మరణం తర్వాత ఆవిడ బాధ్యతలు మరింత పెరిగాయే తప్ప తరగలేదు. పైగా తొంభై దగ్గర పడుతున్న మావగారి ఆలనా, పాలనా. పొద్దున్న ఇంట్లో ఎవరూ లేక కూరలోకి కరివేపాకు కోసం గడ్డిమేటున్న పెరట్లోకి వచ్చిన పద్మావతమ్మగారికి అప్పుడు తట్టింది ఈ చిలిపి ఆలోచన. తన చిరకాల కోరిక తీర్చుకోవడానికి ఆ రోజే కుదురుతుందని నిశ్చయించుకుంది. మనసులో మరుగున ఉన్న చిలిపితనాన్ని వయసు ఆపలేదు, ఆపకూడదు కదా.

భోజనం కాగానే గబగబా మడి బట్ట మార్చుకుని పెరట్లో ప్రవేశించింది. అటూ ఇటూ చూసి గోడకి ఆనించిన నిచ్చెన జాగ్రత్తగా తీసి గడ్డిమేటుకి వేసింది ఆవిడ. అది నేలమీద సరిగ్గా నిలబడిందా లేదా అని చూసుకున్నాకా, తన గోచీ పెట్టిన చీర గట్టిగా బిగించుకుని చీరకొంగులో దోపుకున్న సామాను పదిలంగా ఉందా లేదా అని చూసుకుని మెల్లమెల్లగా నిచ్చెన ఎక్కడం మొదలు పెట్టింది. ఎప్పుడూ అలవాటు లేదు, పైగా తన బరువు నిచ్చెన మోస్తుందో లేదో, కింద పడిపోతానేమో అని ఆందోళన. ఎవరైనా వస్తారేమో పొరపాటున.. మావగారు లేస్తారేమో. ఇలా రకరకాల ఆలోచనలు కందిరీగల్లా.

నుదిటిన చెమట పట్టి బొట్టుమీదుగా ముక్కుమీదకు జారింది. పచ్చని పసుపు రాశిలో పారాణి గీతలాగా. చీరచెంగుతో తుడుచుకుందామని అనుకుంటే, చెంగులో ఉన్న సామానులూ, చేతులు గట్టిగా నిచ్చెనని పట్టుకున్నాయేమూ వదిలేస్తే ఏమవుతుందో నన్న భయం, వెరసి ఆవిడకి కొద్దిగా కంగారు వేసింది. పది మెట్లు ఎక్కేసింది, ఇంకో ఆరో, ఏడో ఉన్నాయి అంతే. కాళ్ళకున్న కడియాలు, అందెలూ మెల్లగా చప్పుడు చేస్తున్నాయి, అదీ ఆవిడకి చిరాగ్గా ఉంది. మెడనిండుగా ఉన్న గొలుసులూ, చేతులకున్న గాజులూ అన్నీ నిశ్శబ్దానికి శత్రువులే. అతి కష్టం మీద నిచ్చెన ఎక్కి గడ్డిమేటు మీద చేరింది ఆవిడ. ఎక్కిన తక్షణం నిచ్చెన కిందకి దూరంగా తోసేసింది. దానికో కారణం ఉంది మరి.

ఇప్పుడు చాలా ఎత్తు అయిన గడ్డిమేటు మీద పట్టుపరుపు మీద మహారాణి లాగా కూర్చుంది ఆవిడ. ఎన్నాళ్ళ కోరికో అది! మెల్లిగా చీర కొంగు తీసి అందులోని వస్తువులన్నీ బయటకు తీసింది. ఒక చెరకు గడా, చిన్న చాకు, ఉప్పూ, కారం పొట్లాలు, భాగవతం పుస్తకం. గడ్డిమేటు మీదనించీ చెయ్యి చాస్తే అందుతుంది దోరగా, ఆకుపచ్చగా, ఆరోగ్యంగా ఉన్న మావిడికాయ. సామానులు తీసిన తరవాత, చీర చెంగుతో మొహం తుడుచుకుని చల్లగాలిని, తలపుల్లో పాతదైనా, కొత్తగా అందిన అనుభవాన్ని ఆనందంగా అనుభవిస్తున్నట్టు కొన్ని క్షణాలు మౌనంగా ఉంది. ఆ నిముషాన ఆవిడ మనసులో ఏముందో చెప్పడం కష్టం. మెత్తగా ఉన్న గడ్డి పూల పాన్పులా ఉంది తనకి. చెయ్యి చాచి మావిడికాయ కోసింది.

జీడి కారేదాకా గడ్డిమీదే ఉంచి తరవాత చీర చెంగుతో తుడిచి చాకుతో చిన్న ముక్కలుగా కోసింది. చెరకు గడ పై పొర పళ్ళతోటీ, చాకుతోటీ చెక్కి అప్పుడు భాగవతం లోని రుక్మిణీ కళ్యాణం చదువుకుంటూ మావిడికాయ ముక్కలు ఉప్పు కారం అద్దుకుని సంతృప్తిగా కారానికి ముక్కులోంచి, కళ్ళల్లోంచీ నీరు వచ్చేంత తృప్తిగా తింది. తిన్న కారం తగ్గడానికి తీపి రసాల చెరకుగడ తింటూ, గజేంద్ర మోక్షం చదువుకుంది. తినడం అయ్యాకా హంస తూలికా తల్పం మీద పడుకున్నట్టు గడ్డిమేటు మీద పడుకుని పుస్తకం చదువుకుంది. ఆ క్షణాన ఆవిడని ఆ భంగిమలో ఈ తరపు వ్యాపారవేత్తలెవరైనా చూస్తే 'గో బాక్ టు యువర్ నేటివ్ 'అనో, 'ది లేటెస్ట్ జాయ్ ఆఫ్ రీడింగ్ ' అనో బోర్డ్ పెట్టి మన అగ్రహారంలో ఒక రిసార్ట్ కట్టినా కట్టేస్తారు.

చాలా సేపు గడిచిన తర్వాత కొద్దిగా పొద్దుపోతున్నట్టు అనుమానం వచ్చింది. చాకు, కాగితంలో జాగ్రత్తగా పొట్లం కట్టిన చెరకు పిప్పి కిందకు విసిరింది. నిచ్చెన పడేసింది కదా, ఇప్పుడుంది అసలు తమాషా. ఆవిడ కోరికలో ఆఖరి అంకం. మళ్ళీ చీర కొంగు గట్టిగా దోపుకుని పెద్దగడ్డిమేటు మీదనించి మెల్లిగా కిందకి జారడం మొదలు పెట్టింది. అచ్చం చిన్నపిల్లలు ఆడుకునే జారుడు బండలాగ. ఆమె

తో పాటు కిందకి జారిన చిన్నమోపుడు గడ్డి . జారిన వెంటనే లేచి నిల్చుని, వంటికి అంటిన గడ్డి దులుపుకొని వెనక్కి తిరిగి తనతో పాటు జారిన గడ్డిని సంతృప్తిగా చూసుకుంది. అప్పుడు నిచ్చెన తీసి గోడకి జారేసి, తను కింద పడేసిన వస్తువులన్నీ జాగ్రత్తగా తీసి ఏమీ ఎరగనట్టు ఇంట్లోకి నడిచింది.

సాయంత్రం వచ్చిన భర్త 'పిల్లలు లేనేలేరు కదా, గడ్డిమేటు దగ్గర గడ్డి ఎలా కిందకి వచ్చింది, ఎవరు తొక్కి పడేసారు? మెత్తబడిపోయిన ఈ గడ్డిని రేపు దూడలు తింటాయో లేదో? 'అని విసుగ్గా ఆలోచిస్తుంటే లోలోపలే నవ్వుకుంది. కానీ నిచ్చెన వేసుకుని గడ్డిమేటు ఎక్కి కూర్చుని, మావిడికాయలూ, చెరుకు ముక్కలూ తింటూ పుస్తకం చదువుకున్నాకా దానిమీదనించి కిందకి పిల్లలు జారినట్టు జారాలన్న తన చిన్ననాటి కోరిక ఈ రోజు అనుకోకుండా తీరిన ప్రభావమే అది, అని భర్తకి చెప్పలేదు.

***

